నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో జరిగే జిల్లా స్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు పిజిఆర్ఎస్‌ను నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. పిజిఆర్ఎస్‌కు రాలేని అర్జీదారులు వారి అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని అన్నారు. అర్జీల స్థితిని తెలుసుకోవాలనే వారు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

సొంత భూములపై హక్కేదీ..

- సెజ్ భూముల కోసం రైతుల నిరీక్షణ
- భూములపై వైసిపి హయాంలో జిఒ
- 2 వేల ఎకరాలకు పైగా అవార్డు భూములు
- నాలుగేళ్లవుతున్నా కానరాని రిజిస్ట్రేషన్లు
- పట్టించుకోని కూటమి సర్కారు

యు.కొత్తపల్లి మండలం రావివారి పాడులో కాకినాడ సెజ్ భూములు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పరిశ్రమలను తీసుకొస్తామని, భారీగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామంటూ 19 ఏళ్ల క్రితం కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి, తొండంగి మండలాల్లో పలువురు రైతులు, ప్రజల నుంచి 10,500 ఎకరాలను అప్పటి ప్రభుత్వం బలవంతంగా లాక్కుంది. భూములు ఇవ్వని వారిని బెదిరించి మరీ భూసేకరణ జరిపారు. కాని నేటికీ ఒక్క పరిశ్రమ కూడా ఇక్కడ అందుబాటులోకి రాలేదు. ఒకటి రెండు చిన్న పరిశ్రమలు తప్ప ఆశించిన స్థాయిలో పెద్ద పరిశ్రమలు ఏమీ రాలేదు. దీంతో భూములు కోల్పోయి ఉపాధికి దూరమై రైతులు, యువత రోడ్డున పడ్డారు.

కాకినాడ సెజ్ కోసం బలవంతంగా పరిహారం ఇచ్చి మరీ రైతుల నుంచి ప్రభుత్వం భూములను తీసుకొని సెజ్‌కు రిజిస్ట్రేషన్లు చేయించింది. పరిశ్రమలు రాకపోవడంతో వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దీంతో దాదాపు రెండు దశాబ్దాలుగా రైతులు పలు పోరాటాలు చేశారు. సిపిఎం వారికి అండగా నిలిచింది. రాష్ట్ర స్థాయి నేతలు సైతం ఇక్కడికి వచ్చి సెజ్ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు సాగించారు. రైతులతో పాటు సిపిఎం నేతలు సైతం కేసులను ఎదుర్కొన్నారు. కోర్టులకు వెళ్లారు. నిర్బంధాలను తట్టుకున్నారు. దీంతో దిగొచ్చిన గత వైసిపి సర్కారు 2021లో అవార్డు భూములను తిరిగి ఇచ్చేందుకు జిఒ జారీ చేసింది. 2,180 ఎకరాలను రైతుల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పింది. కానీ నేటికీ ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. కొంత మంది మాత్రం సిఫార్సులను ఉపయోగించుకుని రిజిస్ట్రేషన్లను చేయించుకున్నారు. 986 ఎకరాలు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. మిగిలిన 1194 ఎకరాల రిజిస్ట్రేషన్ల కోసం 1,550 మంది రైతులు ఎదురు చూస్తున్నారు.

యు కొత్తపల్లి మండలం శ్రీరామపురం గ్రామానికి చెందిన పీర్ల గంగాధర్ కుటుంబ సభ్యులకు రెండున్నర ఎకరాలు రెండేళ్ల క్రితం వారి పేరున రిజిస్ట్రేషన్ అయ్యింది. ఇంకా నాలుగు ఎకరాలు రిజిస్ట్రేషన్ పూర్తి కావాల్సి ఉంది. నాలుగేళ్లు గడుస్తున్నప్పటికీ నేటికీ ఈ ప్రక్రియ ప్రారంభం కాలేదు. సెజ్ పేరుతో ఉండడం వల్ల తమ భూమిపై హక్కు లేకపోవడంతో అప్పులు పుట్టడం లేదని, సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ఆయన వాపోతున్నాడు. ఇలా పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ భూములపై ఎటువంటి హక్కు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని బాధిత రైతులు వాపోతున్నారు. ప్రభుత్వాన్ని ప్రతిఘటించి, అనేక కేసులు ఎదుర్కొని ఆర్థిక ఇబ్బందులు పడి రిజిస్ట్రేషన్‌ల కోసం ఎదురు చూస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదంటూ పలువురు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వం తమ ప్రచారం కోసం రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని గొప్పలు చెప్పినప్పటికీ పూర్తి చేయలేకపోయింది. సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసింది. చివరకి అధికారం కోల్పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలో కొచ్చిన తర్వాత పలుమార్లు రైతులు పాలకులకు మొరపెట్టుకున్నా వినిపించుకోవడం లేదు. కొద్దిరోజుల క్రితం డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను రైతులు కలిసి తమ బాధను చెప్పుకున్నారు. ఏడాదిన్నర కావొస్తున్నా కూటమి సర్కారు తమ సమస్యలను విస్మరిస్తుందంటూ బాధిత రైతులు ఈ సందర్భంగా వాపోతున్నారు. నాలుగేళ్లు గడిచినప్పటికీ భూములపై నేటికీ హక్కు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటిని తామే సాగు చేసుకుంటున్నామని, ప్రభుత్వ పథకాలు ఏవీ అమలు కావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే అధికారులు స్పందించి మిగిలిన రైతులకు రిజిస్ట్రేషన్లు ప్రక్రియను త్వరితగతను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో సెజ్ పేరునే ఉంది

కాకినాడ సెజ్ కోసం భూములను సేకరించినప్పుడు నేను ఎటువంటి పరిహారం తీసుకోలేదు. 273/3, 326,308, 292 సర్వే నెంబర్లలో 10 ఎకరాల భూమి ఉంది. నాకున్న భూమి సెజ్‌లో ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేయాలి. భూమి అమ్మి చేద్దామంటే సెజ్ పేరున ఉండటంతో అమ్మకం కుదరట్లేదు. మా భూమిపై హక్కు కోసం అనేకేళ్లుగా తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు.

-రావి వెంకట రమణ, రైతు, రావివారిపాడు, యు.కొత్తపల్లి మండలం.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - తాళ్ళరేవు

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. ఆదివారం గాడిమొగ పిహెచ్‌సి ఆవరణలో రూ.34.65 లక్షలతో నిర్మించనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (లేబరేటరీ) నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. గ్రామ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు కామాడి మాతరాజు, వైదాడి నూకరాజు పలు సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో అంబులెన్స్ ఉంటే డ్రైవర్ ఉండడని, డ్రైవర్ ఉంటే అంబులెన్స్ పని చేయదని వివరించారు. గుండె సంబంధిత రోగులకు ఆసుపత్రిలో మందులు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రిలయన్స్ కంపెనీతో జరిగిన ఒప్పందం మేరకు ఆసుపత్రి నిర్వహణ కంపెనీయే భరించాల్సి ఉందని అన్నారు.

నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ దాట్ల

ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అంబులెన్స్ డ్రైవర్‌ను నియమిస్తామని, ఆసుపత్రికి అవసరమైన మందులు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి కలెక్టర్‌కు తెలియజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, టిడిపి మండల అధ్యక్షులు దూళిపూడి వెంకటరమణ, డిసి ఛైర్మన్ వేగేశ్న భాస్కరరాజు, నాయకులు ఉంగరాల బూరి బాబు, పొన్నమండ రామలక్ష్మి, మందాల గంగ సూర్య నారాయణ, వాడ్రేవు వీరబాబు, వైద్యులు ఈశ్వర్, రత్నకుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఏకగ్రీవం

ప్రజాశక్తి - కరప

యుటిఎఫ్ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం స్థానికంగా ప్రస్తుత మండల అధ్యక్షులు అర్జున్ ఆధ్వార్యాన నూతన కౌన్సిల్ సమావేశం జరిగింది. తొలుత యుటిఎఫ్ జెండాను యుటిఎఫ్ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ ఆవిష్కరించారు. అమరజీవులు చెన్నుపాటి లక్ష్మయ్య, అప్పారి వెంకటస్వామి, ఎస్‌వి.సూర్యనారాయణరాజు, డి.రామిరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక ఎన్నికల అధికారి పెద్దిరాజు పర్యవేక్షణలో జరిగింది. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెవివి.రమణ, ఎన్.విష్ణు, అసోసియేట్ అధ్యక్షులుగా వి.తేజ, కెవి.రమణ, కోశాధికారిగా ఎన్ఎం.సోమేశ్వసరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఐ.ప్రసాదరావు పాల్గొని మాట్లాడారు. గత 50 ఏళ్లుగా యుటిఎఫ్ ఉపాధ్యాయల సంక్షేమం కోసం, సర్వీస్ కండిషన్స్ కోసం, ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బోధనేతర పనులతో ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచడంతో బోధన కుంటుపడుతుందన్నారు. వెంటనే ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తప్పించాలని, ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం ప్రారంభించిన 'రణభేరి' జాత భవిష్యత్తులో మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు ఉపాధ్యాయులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూరిబాబు, నాగేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.రాజుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ సంఘ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు

బాబోయ్ కుక్కలు...

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలో వీధి కుక్కల బెడదతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తరచూ రహదారి వెంబడి సంచరిస్తూ రోడ్లపై అటు ఇటు పరుగులు తీస్తున్నాయి. ఎక్కడ చూసిన కుక్కలు సంచరిస్తూ కనిపిస్తున్నాయి. హైవే ప్రక్కన సర్వీస్ రోడ్డులోను, గోకవరం రోడ్డులోను మాంసం దుకాణాలు వద్ద ఎక్కువగా సంచరిస్తున్నాయి. అలా సంచరిస్తూ రోడ్డుకు అటు, ఇటు పరుగులు పెడుతున్నాయి. పరుగులు పెట్టే క్రమంలో ద్విచక్ర వాహనాల్లో పడుతున్నాయి. వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. ఇటీవల కాలంలో జగ్గంపేట నుంచి గోకవరం వెళ్ళే రోడ్డులో పలువురు ప్రమాదాల భారిన పడ్డారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు ఇబ్బందులు పడుతున్నారు. నెహ్రు కాలనీ ఎంట్రన్స్ వద్ద, కాలనీలోను ఎక్కువగా గ్రామ సింహాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కలను నిరోధించాలని ప్రజలు, ద్విచక్ర వాహన దారులు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనాల మధ్య పరుగులు తీస్తున్న గ్రామ సింహాలు

'సగరుల ఆర్థిక వృత్తికి సహకరించాలి'

ప్రజాశక్తి - కాకినాడ

సగరుల (ఉప్పర) ఆర్థిక వృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కటారి త్రిమూర్తులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలోని ఒక ప్రయివేట్ హోటల్‌లో గౌరవ ప్రధాన అధ్యక్షులు కటారి రామకృష్ణ అధ్యక్షతన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా సాదరబోయిన నరసరాజు, కటారి పరమేశ్వర రావు, అధ్యక్షులుగా కటారి త్రిమూర్తులు, ఉపాధ్యక్షులుగా ములికి రాయుడు, ఏపూరి రాంబాబు, నక్క మాధవ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జక్కి అప్పన్న, ఉప కార్యదర్శి కటారి వెంకటరాజారత్నం, ప్రధాన కోశాధికారి రాసనబోయిన సత్యనారాయణ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా యూత్ వింగ్ ప్రెసిడెంట్‌గా నక్క కృష్ణమూర్తి, సోషల్ మీడియా వింగ్ ప్రెసిడెంట్ కటారి సామ్యూల్, లీగల్ అడ్వైజర్ గా జి.చిరంజీవి, ఆర్గనైజ్ కార్యదర్శిగా ద్రోణాద్రి అబ్రహం, సభ్యులుగా నక్క సద్గుణ రావు, మొగలి రమేష్, గాది వీరబాబు, తంగేళ్ల సత్తిబాబు కటారి కష్ణమూర్తి తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు కటారి త్రిమూర్తులు మాట్లాడుతూ రాష్ట్రంలోని సగరుల ఆర్థిక పరిస్థితి చాలా ఆందోళన కరంగా ఉందన్నారు. అందువల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బిసి సంక్షేమ శాఖ ద్వారా ప్రత్యేక నిధులను సగరులకు కేటాయించి అమలు చేయాలన్నారు. నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సగర సంఘ ఛైర్మన్ శ్రీనివాసరావును కలిసి సగరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేలా విజ్ఞప్తి చేయడం జరుగుతుందన్నారు.

సగరుల నూతన పాలకవర్గం సభ్యులు

అభివృద్ధి పనుల ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక అయోధ్య రామాపురంలో నూతనంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎంఎల్ఎ నిమ్మకాయ చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి ఆదివారం ప్రారంభించారు. సత్తెమ్మ తల్లి ఆలయ వద్ద నిర్మించిన ముఖద్వారం, వ్రతాల షెడ్డును ప్రారంభించిన వారు సత్తెమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, రైతు సంఘం నాయకుడు కంటే జగదీష్‌మోహన్, కూటమి నాయకులు అడబాల కుమారస్వామి, సరోజ వాసు, చీమలకొండ వీరభద్రప్రసాద్, ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షెడ్ నిర్మాణానికి సహకరించిన ఎంఎల్ఎ, డిసిసిబి ఛైర్మన్లను లయన్స్ భీమేశ్వర క్లబ్ సభ్యులు అమలకంటి శ్రీనివాస్, చిత్తులూరి రాజా తదితరులు సత్కరించారు.

రిబ్బన్‌ను కట్ చేస్తున్న ఎంఎల్ఎ, డిసిసిబి ఛైర్మన్

సామాజిక చైతన్యానికి కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు స్ఫూర్తితో ప్రతి ఒక్కరు సామాజిక చైతన్యానికి కృషి చేయాలని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోష్యుల కృష్ణబాబు అన్నారు. ఆదివారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ అధ్యక్షతన జయంతి సభ జరిగింది. తొలుత గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ కన్యాశుల్కానికి, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గురజాడ సమాజ చైతన్యాన్ని దృష్టిలో పెట్టుకుని కథలు, నాటకాలు, గేయాలు ద్వారా విశేష కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కరణం రాజ్‌కుమార్, దేవత రాజేష్‌కుమార్, గూనూరి వెంకటరమణ, కోరుకొండ సత్యనారాయణ, రత్నావతి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కళాకారులు దారపురెడ్డి కష్ణ, రొంగల వీర్రాజు, దారపురెడ్డి సత్యనారాయణల బృందం అభ్యుదయ, చైతన్య గీతాలను ఆలపించారు.

గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

జిల్లా స్థాయికి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇటీవల జగ్గంపేటలో జరిగిన అండర్ 19 జూడో పోటీలలో ఉత్తమ ప్రతిభను చాటుకుని జిల్లా స్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని స్థానిక బిఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ చంద్రశారద తెలిపారు. ఆదివారం స్థానికంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన డి.కీర్తన, జె.సాయిలావణ్య, వై రమ్య అండర్ 19 పోటీల్లో విశేష ప్రతిభను కనపరిచారని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థినికి విద్యతో పాటు క్రీడలు, వ్యక్తిగత రక్షణకు మార్షల్ ఆర్ట్స్, వ్యాయామం చేయిస్తున్నామని అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు నుంచి క్రీడలు, మార్షల్ ఆర్ట్స్‌పై మెలకువలు తెలుసుకుని తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పోటీ పడే స్థాయికి ఎదగడం సంతోషంగా ఉందన్నారు. క్రీడల ద్వారా మనోధైర్యం, మానసిక ఉల్లాసం, శారీరక ఆకృతి, శారీరక దృఢత్వం పెంపొందుతాయని అన్నారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఉత్తమంగా రాణించి పాఠశాలకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులను అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందించారు.

కీర్తన

సాయిలావణ్య

రమ్య

బాధితుల కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలానికి చెందిన ఒమ్మంగి గ్రామంలో ఆదివారం ఎంఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్, వైసిపి నాయకులు ముదునూరి మురళీ కృష్ణంరాజు పర్యటించారు. గ్రామానికి చెందిన కొప్పర్తి ఏసుబాబు భార్య అనారోగ్యంతో బాధపడటంతో ఆమె వైద్యానికి రూ.5 వేలు అందజేశారు. అదే గ్రామానికి చెందిన అర్జింపూడి రాంబాబు అనారోగ్యంతో బాధపడడంతో ఆయనను పరామర్శించి, రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గంటా గంగబాబు, తోలేటి శేఖర్, శైలు నాగేశ్వరరావు, నార్లంక వెంకన్న బాబు పాల్గొన్నారు.

నగదు సాయం చేస్తున్న ముదునూరి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని అచ్చంపేట గ్రామంలో కొత్త 33/11 కెవి సబ్‌స్టేషన్ లైన్ వర్క్ నిర్వహణలో భాగంగా సోమవారం పలు ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి పనసపాడు ఫీడర్, 11 కెవి ఫీడర్, 11 కెవి వాకలపూడి ఫీడర్, 33 కెవి దేవిసీ ఫుడ్స్ ఫీడర్‌లలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. అచ్చంపేట, కొప్పవరం, పనసపాడు గ్రామాలతో పాటు, ఇండస్ట్రియల్, వ్యవసాయ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

ఆదాయం పెంపుదలకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

నగర పాలక సంస్థ ఆదాయం పెంపుదలకు ప్రత్యేకాధికారి, కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించాలని పౌర సంఘం అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటి పన్నుల విధింపులో అనేక అవతవకలు జరుగుతున్నాయని అన్నారు. సచివాలయం పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కోరారు. నగర వ్యాప్తంగా ప్రతి అర్థ సంవత్సరానికి రూ.5 కోట్ల ఆదాయం కోల్పోతున్నట్లు తెలిపారు.కార్పొరేషన్ దుకాణాలు 50 శాతం బినామీల గుప్పెట్లో ఉండడం వలన భారీ ఆదాయం కోల్పోతున్నట్లు చెప్పారు. మార్కెట్ ఆశీల రాబడి పెరగడం లేదన్నారు. ప్రభుత్వ భవనాలకు భూమి విలువ ఆధారంగా ఆస్తి పన్ను విధించక పోవడం వలన రూ.4 కోట్ల ఆదాయం దక్కడం లేదన్నారు. కార్పొరేషన్ ఆదాయ వనరులు సమీకరించే ప్రణాళికకు ప్రత్యేక చర్యలు వహించాలని కోరారు.

టిడిపి మండల అధ్యక్షునిగా తమరాల

ప్రజాశక్తి - రౌతులపూడి

మండల టిడిపి అధ్యక్షుడిగా ములగపూడి గ్రామ సర్పంచ్ తమరాల సత్యనారాయణ ఎంపికయ్యారు. ఆదివారం ప్రత్తిపాడు టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ సమక్షంలో ఆయన రెండో దఫా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. తనపై నమ్మకంతో రెండోసారి అవకాశం ఇచ్చిన ఎంఎల్ఎకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సత్యనారాయణ ఎంపికపై ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, కత్తిపూడి బుచ్చి సీతయ్యమ్మ మహారాణి సత్రం ఛైర్మన్ శ్రీసోమరౌతు చంద్రమౌళి, మాజీ ఎంపిపి భాస్కర్‌బాబు, సర్పంచ్ పైల సీత, ఎంపిటిసి సభ్యులు శ్రీసోమరౌతు రవి, నాయకులు పైలనాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసి విజయలక్ష్మి మాట్లాడుతూ దాతల ఆర్థిక సాయంతో అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు ఐవి.ప్రసాద్‌శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆశాధులు రాయి నాని, రామచంద్రప్రసాద్, సిబ్బంది ఎస్.రమణ, జి.క్రాంతి, వరహాలు, శివ, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

స్వచ్ఛత మహోత్సవ పోటీలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రైల్వే స్టేషన్లో స్వచ్ఛత మహోత్సవాలలో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక పోటీలను రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్ ఆధ్వర్యం లో నిర్వహించారు. స్వచ్ఛత పక్వాడ్ కార్యక్రమంలో స్వచ్ఛత కార్యక్రమాలను, ర్యాలీలను, అధికారులు సిబ్బందికి వివిధ పోటీలను ఇప్పటికే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఆదిత్య ఆధ్వార్యాన అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ ర్యాలీలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చెట్టు కొమ్మలను కట్టుకుని, ఫ్ల కార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాలంటీర్లు బృందాలుగా విడి కళాశాల పరిసర ప్రాంతాలను, సమీపంలో గల పబ్లిక్ పార్కును శుభ్రం చేశారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని వీలైనంత తగ్గించే ప్రయత్నం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ పిఒలు టి.తేజేశ్వరరావు, డి.అశ్విని, వాలంటీర్లు పాల్గొన్నారు.

అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

నేడు యుటిఎఫ్ హోమ్‌లో సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని యుటిఎఫ్ హోంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు ఆర్‌విఎన్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 'భారత్ పొరుగు దేశాల్లో జరుగుతున్న పరిణామాలు - నేర్పుతున్న పాఠాలు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్.గోవిందరాజులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, యువతకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు జరిగే సదస్సులో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎంఎల్ఎను సత్కరిస్తున్న మత్స్య సొసైటీ పాలకవర్గం సభ్యులు

ఎంఎల్ఎను కలిసిన మత్స్య సొసైటీ సభ్యులు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని యర్రంపాలెం మత్స్య సొసైటీ సభ్యులు ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూను ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన సొసైటీ ఎన్నికల్లో గెలుపొందిన ఛైర్మన్ పాకా నాగేశ్వరరావు, సెక్రటరీ పెదపాటి సుబ్బారావులతో సభ్యులు ఎంఎల్ఎను కలిసి సత్కరించారు. అనంతరం నూతన కమిటీని ఎంఎల్ఎ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, గండేపల్లి ఎస్‌సి సెల్ అధ్యక్షులు పెదపాటి శుభకర్, గండేపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు బొల్లంరెడ్డి రామకృష్ణ, నాయకులు రేఖ బుల్లిరాజు, సైనం సత్తిబాబు, పిల్లి సుబ్బారావు, నూకతట్టు దేవదాసు, సైనం పౌలు, పులి వెంకన్న పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

జంట హత్యల కేసులో నిందితుని అరెస్టు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని తాటిపర్తి గ్రామంలో జంట హత్యల కేసులో నిందితుడైన రంపం గంగాధర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ జి.శ్రీనివాస్ మాట్లాడారు. మండలంలోని తాడిపర్తి గ్రామంలో ఇద్దరు వ్యక్తులను హత్య చేసి, మరొకరిపై అత్యాయత్నం చేసిన సంఘటనలో గంగాధర్‌కు బంధువులైన రంపం శ్రీనివాస్, తోరాటి సూరిబాబుల లక్ష రూపాయలు అప్పు ఇవ్వడమే కాకుండా, వారిద్దరూ మధ్యవర్తులుగా ఉండి కుంపట్ల సూరిబాబు నుంచి రూ.4 లక్షలను అప్పుగా ఇప్పించారు. ఈ అప్పు కోసం కొంతకాలంగా గంగాధర్‌ను ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నిందితుడు గంగాధర్ బాధితుడైన రంపం శ్రీనివాస్, తోరాటి సూరిబాబులను అప్పు విషయమై మాట్లాడదామని ఇంటి నుంచి రాత్రి 8 గంటల సమయంలో బయటకు పిలిచాడు. బీర్బార్ పార్టీ చేసుకుందామని చెప్పి వారు కొవ్వాలు చేసుకుంటున్న మొగలి చిన్న పోలం భావి వద్దకు తీసుకుని వెళ్లి అక్కడ వారిద్దరు నూతి గట్టుమీద కూర్చుని డ్రైడ్ రైస్ తినే క్రమంలో అదును చూసి వాళ్లిద్దరిని నూతిలోకి తోసి హత్య చేశాడు. అనంతరం అదే రాత్రి మరో వ్యక్తి కుంపట్ల సూరిబాబును గొల్లప్రోలు వెళ్లి టీ తాగొద్దామని తన బైక్ పై ఎక్కించుకొని తాటిపర్తి గ్రామ శివారులో ఉన్న పుంత రోడ్డులోని శుద్ధ గడ్డ వాగు దగ్గర కాలువలో ముంచుగా తన సెల్ ఫోన్ పడిపోవడం సూరిబాబు సెల్ ఫోన్ తీసుకుని లైట్ వేసి వెతుకుతున్నట్లుగా నటించి శుద్ధ గడ్డ కాలువలో ముంచి చంపడానికి ప్రయత్నించాడు. అతను తప్పించుకుని పారిపోయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉదయం గ్రామానికి వచ్చి జరిగిన విషయాన్ని మృతుల బంధువులకు తెలియపరచగా వారు కొవ్వులు చేసు కుంటున్న మొగలిచిన్నగారి పొలంలో ఉన్న నూతిలో మతదేహాలు గుర్తించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నింది తునికి కోసం నాలుగు ప్రత్యేక బృందాలు గాలించగా నింది తుడైన రంపం గంగాధర్ పిఠాపురం రైల్వే స్టేషన్‌లో వేరే ఊరిపోయేందుకు ప్రయత్నిస్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో గంగాధర్‌తో పాటు ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ ఎన్.రామకృష్ణ, రైటర్ గంగాధర్, కానిస్టేబుల్ రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

ప్రజాశక్తి - కరప

మండలంలోని జెడ్.భావారం గ్రామంలో గంజాయి ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ టి.సునీత తెలిపిన వివరాల ఇవి... జెడ్ భావారం గ్రామా నికి చెందిన గుళ్ల రాజశేఖర్ ఇంటి వద్ద కొంతమంది వ్యక్తులు గంజాయితో ఉన్నారని వచ్చిన సమాచారంతో తహశీల్దార్ టి.దుర్గాప్రసాద్, ఎస్ఐ సునీత, వీఆర్‌ఒ, పోలీసు సిబ్బందితో కలిసి దాడి చేశారు. గుళ్ల రాజశేఖర్ ఇంటి వద్ద ఉన్న గుళ్ల రాజశేఖర్, శ్రీవల్లి లక్ష్మీగణపతి, వాసంశెట్టి బన్ని, సత్యలను అరెస్టు చేశారు. మరో ముద్దాయి పరారయ్యాడు. వీరి నుంచి 3.174 కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన నిందితుడైన గుళ్ల రాజశేఖర్ ఒక తెలుగు దినపత్రికలో రిపోర్టర్‌గా పని చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట శివారు జగనన్న కాలనీలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అరెస్టు చేసినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. ముందస్తు సమాచారంతో ఎస్ఐ రఘునాథరావు, సిబ్బందితో కలిసి దాడి చేశారని తెలిపారు. ఈ దాడిలో నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.5100 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పేకాడుతున్న 11 మంది అరెస్ట్

ప్రజాశక్తి - రాజోలు

స్థానిక యూత్ క్లబ్ ఆవరణలో నిర్వహి స్తున్న పేకాట స్థావరంపై ఆదివారం రాజోలు సిఐ టివి. నరేష్‌కుమార్, ఎస్ఐ రాజేష్‌కుమార్ దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న 11 మంది అదుపులోకి తీసు కు న్నారు. వారి నుంచి రూ.18 వేల నగదు, 9 సెల్ ఫోన్లు, నాలుగు మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగు మందు తాగిన యువకుని మృతి

ప్రజాశక్తి - సీతానగరం

తల్లిదండ్రులు మందలించారని ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వంగలపూడిలో చోటు చేసుకుంది. సంఘటన సంబంధి నరేంద్ర కుమార్ (20)ను శివారాం తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలని మందలించారు. దీంతో మనస్తాపం చెందిన నరేంద్ర కుమార్ గడ్డి మందు తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన నరేంద్ర కుమార్‌ని రాజమండ్రిలో ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. తండ్రి సుంకవల్లి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - గోకవరం

వెదురుపాక గ్రామానికి చెందిన కోమటి శ్రీను సారా తయారు చేస్తున్నాడనే సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సారా బట్టీపై దాడిచేసి అతని వద్ద నుండి సుమారు 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తామని గోకవరం ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

వృద్ధాప్యంలో అల్జీమర్స్ సహజం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అల్జీమర్స్ వ్యాధి అనేది జ్ఞాపకశక్తి కోల్పోవడం, గందరగోళం, ప్రవర్తన మార్పులకు కారణమని ఇది వృద్ధాప్యంలో సహజమని పింఛన్ వైద్యులు కుమారదేవా అన్నారు. ఆదివారం రమణయ్యపేటలో ఆదిలాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ అల్జీమర్స్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ప్రగతిశీల మెదడు రుగ్మత అని అన్నారు. అల్జీమర్స్ వ్యాధి చిత్త వైకల్యంతో బాధపడుతున్న వ్యక్తులకు అవగాహన కల్పించడం కోసం ప్రతి ఏడాది సెప్టెంబర్ 21న ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఇఎస్ఐలో నమోదు కావాలి

ప్రజాశక్తితో ఇఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ డి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది, వివిధ కంపెనీలలో పనిచేస్తున్న కార్మికులు విధిగా ఇఎస్ఐలో నమోదు చేయించుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఇఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ డి.శ్రీనివాసరావు తెలిపారు. కార్మిక రాజ్య బీమా చట్టం క్రింద నమోదయి ఉన్న వారు అస్వస్థతకు గురి అయినప్పుడు, కార్మికులకు ప్రసవించినప్పుడు, ఉద్యోగ సంబంధమైన ప్రమాదాలకు గురైనప్పుడు లేదా మరణించినా ఇతర వృత్తి సంబంధమైన కారణాల వలన పనికి వెళ్లలేని స్థితిలో ఉన్నప్పుడు ఆర్థిక సహాయం చేయడానికి అలాగే అతనికి, వారి కుటుంబ సభ్యులకు అన్ని రకాల వైద్య సౌకర్యం కల్పించడం ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఈ పథకానికి సంబంధించిన పలు అంశాలపై ఆయన 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వివరించారు.

ఈ బీమా ప్రయోజనాలు ఏమిటి?

ఇతర ఇన్సూరెన్స్ సంస్థలు (బీమా సంస్థలలో) మాదిరిగానే బీమా అనే స్వభావం కార్మిక రాజ్య బీమా చట్టంలో నిబిడీకృతమైయున్నది. కానీ ఇతర బీమా సంస్థలు కేవలం ఒకటే చందాకు ఒకటే ప్రయోజనం చేకూర్చుతాయి. కానీ కార్మిక రాజ్య బీమా పథకం ఒకే చందా ద్వారా బహుళ ప్రయోజనాలు పొందటానికి ఉద్దేశించబడ్డాయి. ముఖ్యమైన ఐదు ప్రయోజనాలతో పాటు అదనంగా మరో ప్రయోజనాలు, మొత్తము 15 ప్రయోజనాలు ఈ పథకం ద్వారా లభిస్తాయి.

నిబంధనలు ఏమిటి?

ఏదైనా పరిశ్రమ గాని లేదా సంస్థ గాని కనీసం పది మంది కార్మికులను ఉపయోగించుకొంటూ తయారీ రంగంలో ఉన్న అన్ని పరిశ్రమలు, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంస్థలకు ఇఎస్ఐ పథకం తప్పనిసరిగా వర్తిస్తుంది. వార్తా పత్రికలు, సినిమా హాళ్లు, రవాణా సంస్థలు, దుకాణాలు, సంస్థలు, హోటళ్లు, ప్రయివేట్ విద్యా సంస్థలు, ప్రయివేట్ ఆసుపత్రులు తదితర సంస్థలకు ఈ చట్టం వర్తిస్తుంది. ఆయా యాజమాన్యాలు ఈ చట్టాన్ని తప్పనిసరిగా అమలు చేయాలి. చట్టాన్ని అమలు చేయని వారు చట్టంలో నిర్దేశించిన విధంగా శిక్షార్హులు అవుతారు.

ఎంత వేతనం పొందుతున్న వారు ఈ పథకానికి అర్హులు.?

ఈ చట్టం పరిధిలోకి వచ్చు కార్మికులకు ఈ చట్టం ఏదైనా పరిశ్రమలకు, సంస్థలకు వర్తింపచేసిన తేదీ నుంచి అందులో పనిచేస్తున్న కార్మికుల ఎవరైతే వారి నెల సరి వేతనం రూ.21 వేలు అంతకంటే తక్కువ పొందుతున్న వారికి మాత్రమే వర్తిస్తుంది.

ఏ విధంగా నమోదు చేయించుకోవాలి.?

ఈ చట్టం పరిధిలోని వచ్చే కర్మాగారాలు, సంస్థలు, ఇఎస్ఐ చట్టం ప్రకారం నమోదు చేసుకోవడానికి వెబ్ పోర్టల్ ద్వారా ఆన్-లైన్లో రిజిస్టర్ చేసుకోవాలి. పరిశ్రమ నమోదు సమయంలో అందులో పని చేస్తున్న మొత్తం కార్మికులను నిబంధనల మేరకు నమోదు చేయాలి.

ఈ పథకానికి వనరులు ఏ విధంగా సమకూరుతాయి.?

ఉద్యోగుల నుంచి వచ్చే చందాల ద్వారా ఇఎస్ఐ పథకానికి ఆర్థిక వనరులు సమకూరుతాయి. ఉద్యోగులకు చెల్లించే మొత్తం వేతనంపై యజమాని వాటాగా 3.25 శాతాన్ని, 0.75 శాతాన్ని ఉద్యోగుల వాటాగా మొత్తం 4 శాతం యాజమాన్యం చెల్లిస్తుంది. యాజమాన్యం తమ నెలసరి ఇఎస్ఐ చందాలను ఆన్ లైన్ ద్వారా ప్రస్తుత నెలా చందాను దాని తరువాత వచ్చే నెల 16వ తేదీ లోపు చెల్లించాలి.

యాజమాన్యానికి ఏయే ప్రయోజనాలు కలుగుతాయి.?

వర్క్ మెన్ కాంపెన్సేషన్ చట్టం 1923, మెటర్నిటీ చట్టం 1961 అమలు నుంచి పూర్తిగా మినహాయింపు ఉంటుంది. కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించే బాధ్యత నుంచి వెసులుబాటు కలుగుతుంది. యాజమాన్యం చందా మొత్తం ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఉంటుంది. యజమానికి బీమా రక్షిత కార్మికులు ఉండడం వలన సంబంధిత కార్యాలయం లేదా సంస్థ ఉత్పాదక శక్తి పెరగడానికి దోహద పడుతుంది. ఈ పథకంకు సంబంధించి మరిన్ని వివరాలకు సందేహాల నివృత్తికి రీజినల్ పరిధిలోని మీ సమీప ఇఎస్ఐ కార్యాలయాలను సంప్రదించవచ్చు. ఇతర వివరాలకు ఇఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ ఫోన్ నెంబర్ 9441405622 ఫోన్ చేసి ఇతర వివరాలు తెలుసుకోవచ్చు.

ప్రయాణం...ప్రమాదభరితం

-గాయాల పాలవుతున్న ప్రయాణీకులు

ప్రజాశక్తి - సామర్లకోట

పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా స్థానిక రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న కెనాల్ రోడ్డు దుస్థితిలో మాత్రం ఏ మార్పు రాలేదు. కెనాల్ రోడ్డు అడుగడుగునా గోతులు పడి నరకప్రాయంగా మారింది. నిత్యం ఈ గోతుల్లో పడి అనేకమంది ప్రయాణీకులు ప్రమాదాల భారిన పడుతున్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి జిల్లా కేంద్రం కాకినాడ వెళ్లే రోడ్డులో గూడ్స్ షెడ్డు మొదలు అయిదు తూముల వరకు ప్రధాన కెనాల్ రహదారికి తూట్లు పడ్డాయి. నిత్యం వేలాది వాహనాలు, లక్షలది ప్రజలు ఈ రహదారి మీదుగా ప్రయాణాలు చేస్తున్నారు. మంత్రులు, ఎంఎల్ఏలు, కలెక్టర్, ఎస్‌పి, ఇతర ఉన్నతాధికారులు నిత్యం ప్రయాణాలు సాగిస్తున్నా రోడ్డు దుస్థితిపై స్పందించకపోవడాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రైల్వే స్టేషన్ కెనాల్ రోడ్డులోని రహదారిపై ఏర్పడిన గుంతలు

వర్షం వస్తే ప్రమాదకరమైన గోతులు నీటితో నిండుకుని ఉండటంతో అవి గోతులని తెలియక ద్విచక్రవాహనాలపై వెళు తున్న ప్రయాణీకులు గోతుల్లో పడి తీవ్రంగా గాయపడుతున్నారు. తాజాగా కురుస్తున్న వర్షాలకు అనేక మంది ప్రయాణీకులు గుంతల కారణంగా గాయాల పాలైన సందర్భాలు ఉన్నాయి. మరోవైపు గోదావరి కాలువను అనుకొని ఉన్న రక్షణ రైలింగ్ బ్రిడ్జి సైతం పూర్తిగా ధ్వంసం అయింది.

సరిపడని ట్రాఫిక్ పోలీసుల ప్రయత్నం

కెనాల్ రోడ్డులో జరుగుతున్న ప్రమాదాలపై స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ ఆదిపా గనగాల స్పందించి దాతలు సాయంతోపాటు, ఆయన సొంత ఖర్చులతో పలుమార్లు వర్షంలో సైతం గోతులను పూడ్చే కార్యక్రమాలు చేపట్టారు. అయితే పూడ్చిన గుంతలు కొద్ది రోజులకే యథాతథంగా మారుతున్నాయి. గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో ప్రయాణీకులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు స్పందించి కెనాల్ రోడ్డులో గోతులకు శాశ్వత పరిష్కారం చూపి ప్రమాదాల నుంచి కాపాడాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

యానాం వార్తలు

వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

వ్యవసాయ శాఖ కార్యదర్శిని కలిసిన రైతులు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి వ్యవసాయ శాఖ కార్యదర్శి చౌదరి మొహమ్మద్ ఆసిన్‌ను రైతు సంఘ ప్రతినిధులు కలిశారు. ఆదివారం యానాంలో పర్యటించిన ఆయనను వ్యవసాయ శాఖ డిడి శివసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు రైతులు కలిసి పలు సమస్యలను వివరించారు. ట్రాక్టర్ల కొరకు ఐదు నెలల క్రితం డబ్బులు చెల్లించామని, కానీ ఇప్పటివరకు అవి రాలేదని అన్నారు. తగ్గగా వాటిని కొంపించి రైతులకు అందజేయాలని కోరారు. ఆయన వారి విన్నపాలను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సత్యనారాయణ, కోన వెంకటరావు, నల్ల వెంకన్న, గోపాలకృష్ణ, కొండపల్లి, మొలగజ్జల ఆనందరావు, కంచర్ల చిన్నబ్బాయి, జోగిరాజు పాల్గొన్నారు.

రాతపరీక్షకు హాజరైన అభ్యర్థులు

ప్రశాంతంగా విఎఒ రాతపరీక్ష

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి రెవెన్యూ అండ్ డిజాస్టర్‌మేనేజ్‌మెంట్ శాఖలో ఖాళీగా ఉన్న విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(విఎఒ) ఉద్యోగాల భర్తీకి ఆదివారం నిర్వహించిన రాతపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గ పరిధిలో రాతపరీక్ష కోసం 6 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు 1460 మంది పరీక్షకు హాజరయ్యారు. 459 మంది గైర్హాజరైనట్లు పరిపాలనాధికారి అంకితకుమార్ తెలిపారు. పరీక్షలను పర్యవేక్షణాధికారి యాసిన్ చౌదరి, అండర్ సెక్రటరీ మురుగేసన్, డిటి జ్యోతుల వెంకటేశ్వరరావు, సిఐ ఆదిలక్ష్మన్, ఎస్ఐ పునీత్‌రాజ్ పర్యవేక్షించారు.

పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి

ప్రజాశక్తి - యానాం

యానాంలోని ద్రాక్షారామ రోడ్‌లో ఉన్న పెట్రోల్ బంకు సిబ్బందిపై ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో మద్యం సేవించి సిబ్బందితో ఘర్షణకు దిగారు. అనంతరం పెట్రోల్ బంకులో ఉన్న సామాగ్రిని ధ్వంసం చేసి, సిబ్బందిపై దాడి చేశారు. ఈ దాడిలో పెట్రోల్ బంక్ సిబ్బందిలో ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్ ఇన్‌ఛార్జ్ పెంకే గణేష్ నిందితులపై కేసు నమోదు చేసి పరిపాలనాధికారి అంకితకుమార్ ముందు హాజరు పరిచారు. వారికి ఆరు రోజుల రిమాండ్ విధించారు.

వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఎముకల్లో పటుత్వం సన్నగిల్లితే రోగాలే

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

శరీరంలో ఎముకల పటుత్వం సన్నగిల్లితే రోగాల భారిన పడతారని డాక్టర్ చల్లా భావతేజ అన్నారు. ఆదివారం రమణయ్యపేట ఎన్‌టిఆర్ నగర్‌లో భావశ్రీ ఆర్థోపెడిక్ అండ్ ఇంటెన్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక బరువు, ప్రయాణాలు ఎక్కువగా చేయడం, వంగి శారీరక శ్రమ చేయడం, దురలవాట్లకు గురవడం వంటి కారణాలతో వెన్నుపూస సమస్యలు ఏర్పడతాయని అన్నారు. దీనిని అధిగమించడం కోసం కాల్షియం అధికంగా లభించే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. శరీర బరువును అదుపులో ఉంచాలని, ఆరు నుంచి ఎనిమిది గంటలు నిద్రపోవాలని, మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్‌ను అదుపులో ఉంచాలని, రోజు శారీరక వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి ఏసుదాసు, ఆదిలాల రత్నప్రసాద్, రాయుడు అనిల్, రాజా, చింతపల్లి సుబ్బారావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, కొప్పుల త్రిమూర్తులు పాల్గొన్నారు.

పైపులైన్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

తాగునీరు వృథా

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఎస్‌సి కాలనీ నుంచి సరఫరా చేసే పైపులైన్ పగిలిపోవడంతో తాగునీరు వృథాగా పోతుంది. దీంతో నాలుగు పేటలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులకు సమస్యను వివరించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 నిమిషాలకు మించి తాగునీటిని సరఫరా చేయడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి ప్రజలకు సక్రమంగా తాగునీటిని సరఫరా చేయాలని కోరారు.

బస్సు వెనుక నిచ్చెనపై ప్రయాణం చేస్తున్న విద్యార్థి

ప్రాణ సంకటంగా ప్రయాణం

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్త్రీ శక్తి పథకంతో ఆర్‌టిసి బస్సులు మహిళలతో కిక్కిరిసిపోతుండటంతో కళాశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు సమయానికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. పథకం అమలులో చూపించే శ్రద్ధ బస్సుల పెంపుదల చేయాలనే విషయాన్ని అటు ఆర్‌టిసి, ఇటు ప్రభుత్వం మరిచిపోయింది. విద్యార్థులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోను, బస్ స్టాప్‌లో సైతం బస్సులు ఆపకపోవడంతో విద్యార్థులు ప్రాణాలకు తెగించి ప్రయాణించాల్సి వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అమలాపురం, కాకినాడ రహదారిలో రద్దీకి తగినట్టు బస్సులు సర్వీసులను పెంపుదల చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గుర్తింపు పదేళ్లకు పెంపుదలకు చర్యలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రయివేటు స్కూల్స్ గుర్తింపును పదేళ్లకు పెంపుదల చేయాలని ప్రయివేట్ స్కూల్స్ యాజమాన్య అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి శ్రీనివాసరావు, న్యాయ సలహాదారు ముత్తమిల్లి శ్రీనివాస్ కోరారు. ఆదివారం స్థానిక కేరళ విద్యాలయంలో మండల ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు పట్టా ఆదినారాయణవర్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు స్కూల్స్ గుర్తింపును ఎనిమిదేళ్ల నుంచి పదేళ్లకు పెంపుదల చేయాలని, ఈ ఏడాది 10వ తరగతిలో నూరు శాతం ఫలితాలను సాధించాలని తీర్మానం చేశారు. ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా తీసుకునే నిర్ణయాల సమయంలో ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర నాయకత్వంతో మండల ప్రయివేట్ స్కూల్స్ ప్రతినిధులు

సమావేశమైన కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు

సిజిహెచ్‌సి హాస్పిటల్ మంజూరు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడలో సిజిహెచ్‌ఎస్ హాస్పిటల్ మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు విజ్ఞప్తి చేశారు. ఆదివారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సంఘ సమావేశం స్థానిక జాతీయ హైడ్రాలజీ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎవిఎస్ఎన్ఎస్.సాయిరాం, తురగా సూర్యారావు మాట్లాడారు. తూర్పుతీరంలో ప్రముఖ స్మార్ట్ సిటీ, పెన్షనర్ల పేరడైజ్, జిల్లా ప్రధాన కేంద్రం కాకినాడలో 25కి పైగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, మంత్రిత్వ శాఖలు ఉన్నాయన్నారు. సుమారు 1000 కుటుంబాలకు చెందిన 3000 మంది సర్వీస్ ఉద్యోగులు, సుమారు 1000 కుటుంబాలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు నివసిస్తున్నట్లు చెప్పారు. కాకినాడకు వెల్నెస్ సెంటర్ ఉన్న రాజమహేంద్రవరం సుమారు 80 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. కావున సిజిహెచ్‌ఎస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

నందన్ ట్రేడింగ్ కొ

E-AUCTION NOTICE

E-AUCTION FOR WATER AFFECTED COPRA STOCK 1500 Bags 75000Kg

E.Auction Forms are invited from Interested Buyers for the E- Auction for water affected Copra Stock-1500 Bags 75000 Kg on As is where is & No complaint Basis Belonging to M/s.Nandan Trading Co, Copra & Coconut Merchants & Comission Agent, Near Telephone Exchange Ambajipet E.G.Dt. A.P. As is where is Basis, No Cpmplaint Basis with all its Debbects As per CVC Guidelines

The Offered Material can be inspected Between 21to27th (Both Inclusive) After the Prior Appointment with Mr.A.Satya Subba Rao at 9440103409 for Participating in Above E-Auction to be held on 29-09-2025, 2.15PM

Please Contact Indian Salvage Settler at 919636548111

నందన్ ట్రేడింగ్ కొ

ఇ-వేలం నోటీసు

నీటి ప్రభావిత ఎండు కొబ్బరి స్టాక్ 1500 బ్యాగుల 75000 కిలోల కోసం ఇ-వేలం

నీటి ప్రభావిత ఎండు కొబ్బరి స్టాక్-1500 బ్యాగులు 75000 కిలోల కోసం ఇ-వేలం కోసం ఆసక్తిగల కొనుగోలుదారుల నుండి ఇ-వేలం ఫారమ్‌లను ఆహ్వానిస్తున్నాము. మెస్సర్స్ నందన్ ట్రేడింగ్ కో, కొప్రా & కొబ్బరి వ్యాపారులు & కమీషన్ ఏజెంట్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ దగ్గర, అంబాజీపేట ఈ.జి.డి. ఏ.పి. ఎక్కడ ఉన్నది అక్కడే ప్రాతిపదికన, ఎటువంటి ఫిర్యాదు లేని ప్రాతిపదికన సివిసి మార్గదర్శకాల ప్రకారం. 29-09-2025 తేదీన, 2.15 PM కి జరగనున్న పై ఇ-వేలంలో పాల్గొనడానికి 9440103409 నంబర్‌లో Mr.ఎ.సత్య సుబ్బారావుతో ముందస్తు అపాయింట్‌మెంట్ తర్వాత 21 నుండి 27వ తేదీ వరకు (రెండు తేదీలు కలిపి) అందించిన మెటీరియల్‌ను తనిఖీ చేయవచ్చు.

దయచేసి ఇండియన్ సాల్వేజ్ సెటిలర్‌ను 919636548111 నంబర్‌లో సంప్రదించండి.

పాస్‌పోర్ట్ పోయినది

తాళ్లరేవు మండలం రంగనాయకపురం తాళ్లరేవు గ్రామ పంచాయితీ, కాకినాడ జిల్లా గ్రామ కాపురస్తులు మేడపాటి వెంకటలక్ష్మి W/o లోవరాజుకు సంబంధించిన పాస్‌పోర్టు జిరాక్స్ నిమిత్తం ది.22-08-2025 తేదిన ఆటోలో వెళ్తుండగా మార్గం మధ్యలో పడిపోయినది. పాస్‌పోర్ట్ నెం.1051400 ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ నందు తెలుపగలరు.

మేడపాటి వెంకటలక్ష్మి
W/o. లోవరాజు, రంగనాయకపురం
తాళ్లరేవు మండలం, కాకినాడ జిల్లా
సెల్. 9949630246

IN THE COURT OF THE 12TH ADDL.DISTRICT JUDGE-CUM-MACT, PITHAPURAM
M.V.O.P.No.36/2024

Between:-
తాకాసి శివ ...పిటిషనర్
మరియు
దన్నిన శేఖర్ వగైరా ...రెస్పాండెంట్లు
1st Respondent: దన్నిన శేఖర్ S/o వెంకటేశ్వ రావు, వయస్సు 43సం॥లు, JCB డ్రైవర్, మట్లపల్లి వారి వీధి, సామర్లకోట.

పై నెంబరు వ్యాజ్యము నందు 1st Respondent కు కోర్టు ద్వారా పంపిన సమన్సు పంపినను కోర్టు సమన్లు అమలు కాకుండా త్రిప్పిరావడమైనది. కావున ది.03-10-2025 తేదీ ఉదయం 10.30గం॥లకు కోర్టు యందు వ్యక్తిగతంగా కాని ప్లీడరు ద్వారా గాని హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షములో కేసు నిర్ణయం పలుచును శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము తెలియపర్చడమైనది.

జి.డి.ప్రసన్న కుమార్
అడ్వకేట్, పిఠాపురం
సెల్.9395389211

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

HMOP 51/2025

Between:-
సుధా లక్ష్మి ...పిటీషనర్
మరియు
సుధా లక్ష్మీపతి రావు తండ్రి సూకరాజు, C/o. పి. శ్రీనివాస్, వయస్సు 45 సం॥లు, హిందూ, ఎంప్లాయి, బి.సికాలని, మల్లేపల్లి గ్రామం,గండేపల్లి మండలం, పిఠాపురం J.C.J.C. లిమిట్స్ ...రెస్పాండెంట్

పై గ్రంథములో మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపినను బుద్ధిపూర్వకము పుచ్చుకొనక ఎగ్గొట్ట చేయుచున్నందున శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ది.06-10-2025 వసంబు తేదిన మీరు పై కోర్టువారి ఎదుట హాజరు ఉదయం గం॥.10.30 ని॥లకు మీ అక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల పై గ్రంథము మీ పరోక్షమున తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

పి.రాజేంద్రప్రసాదరావు
అడ్వకేట్, పిఠాపురం
సెల్.9440771414

ప్రకటన

మహారాజశ్రీ అమలాపురం సివిల్ జడ్జి వారి కోర్టులో (సీనియర్ డివిజన్)

O.S. 43/2024

బిట్వీన్:
సుగ్గు సుబ్రహ్మణ్య శ్రీనివాస్ ప్రసాద్ @ శ్రీనివాస్ సుబ్రహ్మణ్య ప్రసాద్ -వాది
అండ్
తిరుతలెట్టి సూర్యనారాయణమూర్తి, S/o. మంత్రాల స్వామి, వ్యాపారము, డో.నెం. 12-1-5/1, పద్మనీపేట, అమలాపురం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా. -ప్రతివాది

పై నెంబర్ దావాలో మీ మీద నా 11-09-2022 న వ్రాయించి యిచ్చిన Promissory note బాకీ రూ. 16,00,000/- అందలి వడ్డీ యువత్తు వసూలు నిమిత్తం మీ మీద దావా వేసినారు. మీకు అనేక పర్యాయాలు శ్రీ కోర్టు వారు ద్వారా శ్రీ కోర్టు వారు సమ్మన్ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియపరచినను మీరు పుచ్చుకొనక లేదను, దావాయిదా ది. 25-09-2025వ తేదీకి ఉన్నది. కావున్ వాయిదాకి మీరు స్వయంగా గాని, లేదా న్యాయవాది ద్వారా గాని మీరు ఉదయం గం॥ 10.30ని॥ హాజరు అయ్యి సంజాయిషీ యియ్యకోనేది. లేని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానం చేయుదురు.

(బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు)
వీరన సాయి, అడ్వకేట్
అమలాపురం, సెల్: 9848615771

మహారాజశ్రీ అమలాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No.7/2021,O.S.No.163/2013

Between:-
మోపూరి దుర్గా ప్రసాద్ ...DHR
మరియు
కడలి వీరవెంకట సత్యనారాయణ S/o. (లేటు) నారాయణ, 10వ మైలు రాయి Opp. ఎలిమెంటరి స్కూల్,రాజోలుమొండి, రాజోలు, ముమ్మిడివరంJ.C.J ...JDR

పై నెంబరు డిక్రీ ప్రకారం, DHR వారు, JDR ప్రతివాది వల్ల రావలసిన డిక్రీ బాకీ మొత్తం రాబట్టు కొనుటకు JDR ఆస్తులను వేలం వేయుటకు షెడ్యూల్ దాఖలు చేశాను. శ్రీ కోర్టు వారి ఎదుట ది.06-10-2025 సం॥రం తేదీని ఉదయం గం 10.30ని॥లకు బాకీ మొత్తము వేలం వేయబడును. కావున పాటదార్లు 1/4 వంతు ధరావత్తు సొమ్ముతో హాజరయి వేలం పాట పాడుకొన వచ్చును. అవసరమైన సంజాయిషీ DHR అడ్వకేటు గారు ఆఫీసునందు తెలుసుకొనవలెను.

వేలం ఆస్తి వివరం

ఐవిదలలో తూర్పుగోదావరి జిల్లా ప్రస్తుతం B.R.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం సబ్‌రిజిస్ట్రార్ చేరిన ముమ్మిడివరం గ్రామపంచాయితీ పరిధిలోని ముమ్మిడివరం గ్రామం తాలూకు జిరాయితి మెట్ట R.S.No.7/5 రు.0.27 ఎ॥ భూమికి హద్దులు.

తూర్పు :- నడింపల్లి సీతాపతి రాజు గారు భూమి
దక్షిణం :- కడలి సత్యనారాయణ గారు భూమి
పడమర:- కడలి రామన్న గారు భూమి
ఉత్తరం:- దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు గారు భూమి.

సదరు హద్దుల మధ్యగల య 0.27ఎ॥ భూమి నిండా వున్న ఫల వృక్షములు, ఎవత్తు యాజమాన్య హక్కులు, సర్వం సహా.

DHR కిమ్మత్తు రు. 1,50,000/-
అమీనా కిమ్మత్తు రు. 19,44,000/-
JDR కిమ్మత్తు రు. తెలియపర్చలేదు.

ఎస్.సీతారామరాజు
వి.నాగేశ్వరరావు
అమలాపురం అడ్వకేట్స్, సెల్.9948882983
ది.20-09-2025 అమలాపురం